

# మునిగిపోతున్న నౌక

## శీరం నారాయణస్వామి

ఆ ఇల్లాలు చాలా సేపటినుంచి వీధి గుమ్మం దగ్గరే నిలబడి చిరు చీకటి అలముకొనిఉన్న ఆ వీధి చివరికంటా కళ్ళు చికిలించుకుంటూ చూస్తున్నది పుట్టెడు ఆందోళనతో! నిలబడీ నిలబడీ కాళ్ళు నొచ్చుతున్నాయి. అయినా లోనికి వెళ్ళడానికి మన స్కరించడంలేదు. చీకటిలోకి చికిలించుకుని చూడ టంవల్ల ఆమె నేత్రాలు రెండూ శ్రమకులోనయి అశ్రువులు రాలుతున్నాయి. పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూనే ఎంతో ఆత్రుతతో ఎదురు చూపులు చూస్తున్నదల్లా చివ్వున తలతిప్పి ఇంట్లో గోడకు వేలాడుతున్న గడియారానికేసి చూసింది.

'అమ్మో పదిన్నర దాటింది' అనుకుంటూ ఒక నిట్టూర్పు విడిచి వీధి తలుపులు దగ్గరగా చేరవేసి లోనికి అడుగుపెట్టింది.

ఆమెకు ఇద్దరే సంతానం. ఇద్దరూ ఆడపిల్లలే. పెద్దమ్మాయి ఇంటర్ రెండో సంవత్సరమూ, చిన్న మ్మాయి పదో తరగతీ చదువుతున్నారు. పెద్ద పరీ క్షలు దగ్గర పడడం చేత పరిసరాలను కూడా మరచి పోయి చదువులో లీనమైపోయి ఉన్నారువాళ్ళు.

ఆమె పెద్ద కూతురు దగ్గరకు వెళ్ళింది. ఏదో అపరాధం చేసిన దానిలా తలదించుకుని చాలా చాలా తగ్గు స్వరంతో అన్నది

''పదిన్నర దాటింది. మీ నాన్న గారు ఇంకా రాలేదు''

తల్లినోటి వెంబడి ఆ మాటలు రావడంతోనే ఆ అమ్మాయి తోక తొక్కిన తాచులా కస్సుమని లేచింది. పట్టరాని కోపంతో చేతనున్న పుస్త కాన్ని దూరానికి విసిరికొట్టింది. తనవంక బిత్త రపోయి చూస్తున్న చెల్లెలితో ''ఇంకా చూస్తావేం.. లే.. లేచిరా.. ఆయనగారు వీధిలో ఏ చెత్తకుండీ దగ్గరపడి ఉన్నాడో వెళ్ళి వెతికి తీసుకువద్దాం'' అంటూ పక్క గదిలోకి వెళ్ళి వంకీకి ఉన్న చున్నీని తీసి భుజాలనిండా కప్పు కున్నది.

చెప్పుల్లో కాళ్ళు దూరుస్తూ ఎంతో ఆవే శంతో పిడికిలి బిగించి గట్టిగా నుదుటికేసి కొట్టుకున్నది.

''ఏ జన్మలోనో ఏ పాపం చేసుకున్నామో మరి. ఈ కొంపలో పుట్టాము''

అక్కా చెల్లెళ్ళిద్దరూ గుమ్మందాటారు. వెళుతూ వెళుతూ కూతురన్న ఆ మాటలు ఆ ఇల్లాలి గుండెలో గునపంలా గుచ్చుకున్నాయి. కళ్ళనుంచి అశ్రువులు రాలుతుంటే పైట చెంగుతో తుడుచుకుంటూ ఉండిపోయింది.

కళ్ళు ఒత్తుకునీ ఒత్తుకునీ ఆమె పైట చెంగు ఎప్పుడూ చెమ్మగానే ఉంటుంది. పాపం దురదృష్ట వంతురాలు. మనుషులందరి నుదుటి రాత భగవం తుడు రాస్తే ఆడదాని నుదుటిరాత మాత్రం కట్టుకు న్నవాడే రాస్తాడు.

ఆమెను కట్టుకున్న భర్త ప్రభుత్వోద్యోగి. జీతం కన్నా పై సంపాదన ఎక్కువగా ఉండే ఉద్యోగమది. అదే కొంప ముంచింది. ఎలా అలవాటయిందో మరి తాగుడు అలవాటయింది. క్రమేపీ దానికి బానిస అయిపోయాడు. అదే అతడి లోకమైపో యింది. మంచినీరు ముట్టనిరోజు ఉంటుందేమో కానీ మద్యం ముట్టని రోజు మాత్రం లేదు. తాగే తాగే మత్తులో తూలుకుంటూ ఏ రాత్రికో ఇల్లు చేరు కుంటాడు.

తూలుడు మరీ ఎక్కువయి ఇంటికి వచ్చేదా రిలో ఎక్కడబడితే అక్కడ అపస్మారకంగా పడిపో యిన రోజులెన్నో ఉన్నాయి. అలాపడటంలో ఒక సారి పక్కటెముకలు రెండూ విరిగాయి. నెల రోజులు ఆస్పత్రిలో ఉండవలసి వచ్చింది. వైద్యం కోసం వేలకొద్దీ రూపాయలు విరజిమ్మాల్సి వచ్చింది. మరొకసారి కంకరరాళ్ళ గుట్టమీద పడిపో వడంచేత నుదుటి మీద పెద్ద గాయమయింది. ఆస్పత్రిలో మూడు కుట్లు కుట్టాల్సి వచ్చింది. దానికీ బోలెడు ఖర్చు. ఇంకొకసారి జీతం అందు కున్న రోజు మరీ ఎక్కువ మత్తులో తేలిపోతుంటే చోరాగ్రేసరుడొకడు అదే అవకాశంగా జేబులో ఉన్న జీతం డబ్బులు మొత్తం తస్కరించాడు. ఖర్చులకు డబ్బేమీ లేకపోవడంతో ఆ నెల గడపడానికి ఆ ఇల్లాలు పడరానిపాట్లు పడింది.

ఇంత జరిగినా అతడికి చీమ కుట్టినట్లుగా కూడా ఉండదు. రాత్రి పడకొండు గంటలు దాటిన వేళ...

ఇంటిముందాగిన ఆటోలో నుంచి కూతుళ్ళి ద్దరూ కలసి అపస్మారకస్థితిలో ఉన్న తండ్రిని కిందికి దింపారు. పెద్ద కూతురు భుజాల దగ్గరా చిన్న కూతురు కాళ్ళదగ్గరా పట్టుకుని అతికష్టంమీద ఆయనను ఇంట్లోకి చేరవేశారు--బియ్యపు బస్తాని చేరవేసినట్లు....

తెల్లవారిన తరువాత కూతుళ్ళిద్దరూ ఇంట్లో లేని సమయం చూసి ఆ ఇల్లాలు అతడితో మొర పెట్టుకుంది.

''ఆడపిల్లలిద్దరూ ఎదిగి వస్తున్నారు. వాళ్ళ ఒంటిన గ్రాము బంగారం కూడా లేదు సరికదా వాళ్ళకంటూ ఒక్క రూపాయి కూడా వెనక వేసింది లేదు. మీరింత బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తు న్నారు కదా ఇలా అయితే వాళ్ళ బతుకులేం కావాలి ? తప్పతాగి ఒళ్ళు తెలియకుండా పడి ఉన్న మిమ్మల్ని ఎదిగిన ఆడపిల్లలు అలా ఇంటికి మోసు కువస్తున్నారు కదా అది తలచుకుంటే మీకు సిగ్గని పించడం లేదా ?''

ఇంచుమించు ప్రతిరోజూ ఆమె చెప్పే మాటలే అవి. ఆ మాటల్లో కోపం లేదు. ఎనలేని శోకం ఉంది. ఆవేశం లేదు. అసహాయత ఉంది. తన మాటలు అతడిలో మార్పు తీసుకువస్తాయనే ఆశ ఆమెలో ఏనాడో అంతరించిపోయింది. అయినా ఏదో తాపత్రయం ఆమెచేత ఈ మాటలు పలికిస్తు న్నది.

చిత్రం! ఈ సారి ఆమె మాటలు అతడిపై ఎంతో ప్రభావం చూపాయి. అతడిలో అనూహ్యమైన మార్పు వచ్చింది.

తప్పతాగి ఏ చెత్తకుండీ దగ్గరో పడిఉన్న అత డిని వెదికి ఇంటికి మోసుకురావల్సిన పరిస్థితి అతడి కూతుళ్ళకు మరలా ఎన్నడూ కలగలేదు.

ఎందుకంటే అతడిప్పుడు ఇంట్లో భార్యా కూతుళ్ళ సమక్షంలోనే మద్యం సేవిస్తున్నాడు మరి...

★

*(మద్యంపై ఆదాయాన్ని పెంచి ఖజానాను నింపుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం అనైతిక విధానం ఈ కథకు ప్రేరణ)*

**సెల్ : 9440306485**